క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రి కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం సహస్రనామార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపచేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవాచనం నిర్వహించారు. 1001నామాలతో స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

స్వయంభూవరం గ్రామాన్ని తరలించండి



మూల స్వయంభూవరం మహిళల సమస్యలను తెలుసుకుంటున్న కోటేశ్వరరావు

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న కలపాక శివారు మూల స్వయంభూవరం గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్వయంభూవరం గ్రామానికి శనివారం సందర్శించిన కోటేశ్వరరావు స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూలస్వయంభూవరం గ్రామం అత్యంత కాలుష్య కారక గ్రామంగా మారిపోయిందన్నారు. ఎన్టీపీసీ కాలుష్యంతో కిడ్నీ, కంటి, ఊపిరితిత్తులు, గుండె, క్యాన్సర్, చర్మ వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రక్తదాన శిబిరానికి స్పందన



దాతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. గాజువాకకు చెందిన వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 52 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దాతలకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు పెతకంశెట్టి ఉమాశంకర్రావు, సిరిమళ్ల గణేష్, కారి సూర్యనారాయణ, పెంటకోట గణేష్, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వి.వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికనగర్‌లో హైమాస్ట్ లైటు ప్రారంభం



హైమాస్ట్ లైటు ప్రారంభిస్తున్న శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని కార్మికనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటును శనివారం సాయంత్రం కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు చేతుల మీదుగా ప్రారంభించారు. నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్యం పడగ

- నల్లటి బూడిదతో ప్రజలు విలవిల
- పంటలకు తీవ్ర నష్టం
- శ్వాసకోశ వ్యాధులతో సతమతం
- ఎన్టీపీసీ నుంచి విడుదలవుతున్న కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి



కాలుష్యం వెదజల్లుతున్న సింహాద్రి ఎన్టీపీసీ చిమ్నీలు



వెన్నలపాలెంలో కాలుష్యం బారిన పడి పూతకు రాని మామిడి చెట్లు



ఎన్టీపీసీ కాలుష్యంతో వెంకటపతిపాలెంలో నల్లగా మారిన కొబ్బరి, అరటి చెట్లు



నల్లగా మారిన అరటి చెట్లు



ఇళ్లలో చేరిన మసిని చూపుతున్న బాధితుడు



స్వయంభూవరంలో కూలింగ్ టవర్లు విడుదల చేస్తున్న ఉప్పునీటితో దెబ్బతింటున్న ఇళ్లు



పొల్యూషన్ కారణంగా స్వయంభూవరంలో ఎర్రబడిన వరి పంట (ఫైల్)

పరవాడ:

సింహాద్రి ఎన్టీపీసీ విడుదల చేస్తున్న కాలుష్యంలో చిక్కుకొని మండలంలో అనేక గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అందుకు వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం , తిక్కవానిపాలెం, పరవాడ, వెన్నలపాలెం, రావాడ, సోమినాయుడుపాలెం, స్వయంభూవరం , కలపాక గ్రామాలను ఉదాహరణగా పేర్కోవచ్చు. సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటైతే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించి 1997లో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, రావాడ, వెన్నలపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు 3,492 ఎకరాల వ్యవసాయ భూములను సంస్థకు ధారదత్తం చేశారు. రైతుల నుంచి సేకరించిన వ్యవసాయ భూమిలో ఎన్టీపీసీ 2 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేసింది. మొక్కుబడిగా కొందరికి శాశ్వత ఉపాధి చూపించి చేతులు దులుపుకుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మాట దాటవేసింది. ఉపాధి అవకాశాలను పక్కన పెడితే పవర్ ప్లాంటు వల్ల కాలుష్యం ప్రభావం తీవ్రమైంది. చిమ్నీల ద్వారా యథేచ్ఛగా నల్లటి బూడిద గ్రామాలను కమ్ముకుంటోంది. ప్రజల అనారోగ్యాలకు కారణమవుతోంది.

వ్యవసాయ భూములు నాశనమవుతున్నాయి.

నల్లటి బూడిదతో తీవ్ర ఇబ్బందులు

గ్రామీణ ప్రజలకు ఎలాంటి కాలుష్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకొంటామని సంస్థ ప్రజలకిచ్చిన హామీని గాలికి వదిలేసింది. ఎన్టీపీసీ చిమ్నీల ద్వారా నిత్యం నల్లటి బూడిదను గ్రామాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చిమ్నీల ద్వారా విడుదలవుతున్న నల్లటి బూడిదను పీల్చడం వల్ల కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసం, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, నల్లటి, తెల్లటి మచ్చలు, మహిళలకు సంబంధించిన పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. గాలిలో ఎగిరి పడుతున్న నల్లటి బూడిద నివాసిత గృహాలపై పడి నల్లగా మారిపోతున్నాయి. ఎక్కడికక్కడే మసి పేరుకుపోతుండడంతో ఇంట్లో భద్రపర్చుకొన్న సామగ్రి, దుస్తులు, ఇళ్ల పై కప్పులు నల్లగా మారిపోతున్నాయి. ఎన్టీపీసీ ద్వారా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి వ్యవసాయ పంటలు, పండ్ల తోటలకు తీవ్ర నష్టం కలగజేస్తున్నాయి. ముఖ్యంగా మామిడి, జీడి, అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లితోంది. తోటలపై విపరీతంగా నల్లటి బూడిద పేరుకుపోవడం వలన పూత రాకపోవడమే కాకుండా వచ్చిన పూత నిలబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీపీసీ పొల్యూషన్‌తో కాయగూరలు కూడా సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని రైతులు చెబుతున్నారు. సంస్థ కూలింగ్ టవర్ల నుంచి ఎగసి పడుతున్న తుంపర్లతో ఇళ్ల బీటలు వారి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎన్టీపీసీ ఫ్లైయాష్‌ను నిల్వ చేసిన బూడిద చెరువుల వలన భూగర్భ జలాలు కూడ కలుషితమై గొంతు తడుపుకోవడానికి మంచినీళ్లు దొరకడం కష్టంగా మారిందని పల్లె వాసులు గగ్గోలు పెడుతున్నారు.

పంటలు నాశనమవుతున్నాయి



ఎన్టీపీసీ నుంచి ఎగసిపడుతున్న తుంపర్లు, నల్లటి బూడిదతో వరి, కూరగాయలు వంటి వ్యవసాయ పంటలు నాశనమవుతున్నాయి. పండ్ల తోటల పరిస్థితి అంతే..చెట్లు,చేమలు నల్లగా మారిపోతున్నాయి. ఎన్నడూ లేని విధంగా నల్లటి బూడిద ఎగసిపడుతోంది. ఉప్పు నీటి తుంపర్ల వల్ల ఇళ్ల బీటలు వారి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. బూడిదను అరికట్టడానికి ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలి.

–తుంపాల అప్పారావు, రైతు, స్వయంభూవరం

అనారోగ్యాల బారిన పడుతున్నాం



ఎన్టీపీసీ విడుదల చేస్తున్న పొల్యూషన్‌తో మహిళలు అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు, కిడ్నీ, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధులు, విష జ్వరాలు వంటి సమస్యలతో నిత్యం ఇబ్బంది పడుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. తాగడానికి దూర ప్రాంతాల నుంచి శుద్ధి చేసిన నీటిని తెచ్చుకొంటున్నాం.

–కూండ్రపు దేముడమ్మ, సోమినాయుడుపాలెం

ఇళ్లన్నీ నల్లగా మారిపోయాయి



నిత్యం ఎన్టీపీసీ నుంచి ఎగసి పడుతున్న నల్లటి బూడిదతో ఇళ్లు మసిబారిపోతున్నాయి. తుడవడానికి రెక్కలు పడిపోతున్నాయి. ప్రతీ రోజు నీటితో శుభ్రం చేసుకోవలసి వస్తుంది. గ్రామంలో ఇళ్లన్నీ మసితో నిండి ఉన్నాయి. ఇళ్లలో వస్తువులు, తాగునీరు, దుస్తులు నల్లగా మారిపోతున్నాయి. బూడిదను అరికట్టడానికి ఎన్టీపీసీ చర్యలు తీసుకోవాలి.

–పోలవరపు దాలమ్మ, వాడచీపురుపల్లి

ఆకతాయిల దూకుడుకు కళ్లెం

- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై కఠిన చర్యలు
- 'ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇంటెలిజెన్స్'లో సీఐ సతీష్‌కుమార్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ఇటీవల కాలంలో పెరుగుతున్న ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి సతీష్‌కుమార్ అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇంటిలిజెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల నుంచి పోలీసులకు అందే సమాచారాన్ని బట్టి నిఘా బృందాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై తగిన నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. పండగలు, ఇతర కార్యక్రమాల్లో పేకాట, కోడి పందాలు, అశ్లీల నృత్యాలపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. కేసుల దర్యాప్తును సమయానికి పూర్తి చేసి నిందితులను కోర్టులో హాజరు పరచాలన్నారు. ప్రజల శాంతిభద్రతలను కాపాడే విషయంలో కఠినంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సహకారంతో నేరాలను పూర్తిగా అదుపులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుడికి వైద్య సదుపాయం



మానసిక ఆస్పత్రిలో రామిరెడ్డిని చేర్పించిన పోలీసులు

పెందుర్తి: మానసికంగా అనారోగ్యానికి గురై చుట్టుపక్కలవారితో గొడవ పడుతున్న ఓ వ్యక్తికి తగిన వైద్య సదుపాయం సమకూర్చేందుకు పెందుర్తి పోలీసులు నగరంలోని మానసిక ఆస్పత్రిలో చేరి్పంచారు. కృష్ణరాయపురానికి చెందిన వత్రపు రామిరెడ్డి కొన్ని రోజులుగా మానసికంగా అస్థిరతకు గురయ్యాడు. దీంతో చుట్టు పక్కల వారితో వివాదాలకు దిగడం, దూషించడం వంటి చర్యలకు పాల్పడుతున్నాడు. దీనిపై అతని బావమరిది తెకెటి వెంకట రామిరెడ్డి పెందుర్తి పోలీసులకు సమాచారం అందించాడు. స్పందించిన పోలీసులు సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మానసిక వైద్యశాలలో చేర్పించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి వారు ఎవరైనా ఉంటే సమాచారం అందించాలని సీఐ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

పంట నిల్వకు యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌బాబు

పెందుర్తి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట నిల్వకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని కేంద్ర గిడ్డంగుల సంస్థ జిల్లా యూనిట్–1 మేనేజర్ పి.శ్యాం సుందర్‌బాబు సూచించారు. స్థానిక మహిళా ప్రగతి కేంద్రంలో 'కృషి సంవర్ధన్' కార్యక్రమంలో భాగంగా శాస్త్రీయ పద్ధతిలో ధాన్యం నిల్వ చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతులతో సేద్యం చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటే రైతులకు వ్యయభారం తగ్గుతుందన్నారు. పంట నిల్వకు ప్రభుత్వ గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు గిడ్డంగుల సంస్థ నుంచి అందుతున్న రుణ సదుపాయాల గురించి వివరించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఒక్కో రైతుకు 1.5 క్వింటా మెటల్ బిన్‌లు, ఒక కిలో రాగి విత్తనాలు ఉచితంగా అందించారు. మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ ప్రతినిధులు ద్రవిన్ గొట్టపు, మజ్జి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ్'లో జాబ్‌మేళాకు విశేష స్పందన

- పలు కంపెనీల్లో ఉపాధికి 81 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో థియోఫిలాస్, ఫ్లోరా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు చక్కటి స్పందన లభించింది. మొత్తం 14 కంపెనీల్లో ప్లేస్‌మెంట్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా 172 మందికిగాను 81 మంది అర్హత సాధించారు. వీరికి కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. ఎంపికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కమలారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఏవో జి.రవిబాబు, డి.సింహాచలం, కె.బ్యూల మెర్సి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రగ్‌ఫ్రీ ధ్రువపత్రాలు

స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ డ్రగ్ ఫ్రీ ధ్రువపత్రాలు అందజేశారు. నగరంలోని ఏయూ కన్వెన్షన్ హాల్ శనివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు డ్రగ్స్ గురించి పలు ప్రదర్శనలు చేశారు. వారిలో ప్రతిభ కనబరిచిన 18 మందికి సీపీ ధ్రువపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎస్.ఈ ఫ్లోరా, ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకురాలు విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోపీ ప్రకారం చందనోత్సవ నిర్వహణ

- ప్రభుత్వ కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు

సింహాచలం: సింహగిరిపై వచ్చేనెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. చందనోత్సవం విజయవంతంగా జరిగేందుకు ప్రస్తుత రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను తయారుచేశారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడానికి, మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలతో కూడిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని తయారుచేసి, ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించారు. ఈ మేరకు ఎస్‌వోపీని ఆమోదిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయశాఖ మంత్రి, హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు ఎప్పటికప్పుడు జారీచేసే సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. చందనోత్సవం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

పరవాడ: పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. వివరాలివి.. ఫార్మాసిటీలో రాంకీ ల్యాండ్ ఫిల్ కొండ సమీపంలో శనివారం ఉదయం 9.45 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా, స్థానికులు గుర్తించి రాంకీ అంబులెన్స్‌పై నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. అయితే, ఆ వ్యక్తి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కేజీహెచ్ వైద్యులు ధ్రువీకరించారు. తాడి వీఆర్వో వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వయసు సుమారు 52 సంవత్సరాలు ఉంటుందని, మెరూన్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, వైట్ కలర్ బనియన్ నడుముకు టవల్ చుట్టబడి ఉందని సీఐ చెప్పారు. సదరు వ్యక్తి వివరాలు తెలిసిన వారు 94407 96038 నంబరుకు సమాచారం అందించాలని సీఐ మల్లికార్జునరావు కోరారు.

సెమీస్‌కు మూట్ కోర్టు పోటీలు



న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

విశాఖ విద్య: న్యాయ విద్యార్థుల్లో నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించే విధంగా జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు జరుగుతున్నాయి. ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు రెండో రోజు శనివారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరగనున్న సెమీ ఫైనల్స్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత న్యాయమూర్తులు డాక్టర్ బి.సత్యనారాయణ, డి.ధర్మారావు, విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు కె.ఏ ప్రకాష్, బి.వి.ఆర్.మూర్తి వ్యవహరించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల పూర్వాచార్యులు ఆచార్య వి.కేశవరావు ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి, ఆచార్య చంద్రకళ, మూట్ కోర్టు పోటీల సమన్వయ కర్త డాక్టర్ ఎల్.వి.కె ప్రసాద్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఈ-తరంగ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ–తరంగ్–2025 పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్ శనివారం వేడుకగా ప్రారంభమైంది. ఫెస్ట్ ప్రారంభోత్సవం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డా. కె. కుమార్ రాజా (మేనేజింగ్ డైరెక్టర్ – కె.కుమార్ రాజా ప్రాజెక్ట్)విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నూతన విషయాలపై అవగాహన, పరిశోధన రంగాల్లో అవకాశాలు దక్కించుకునేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ ప్రొఫెసర్ పీవీ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థుల క్రియాశీలత, వినూత్న ఆలోచనల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. పద్మశ్రీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రాక్టికల్ జ్ఞానాన్ని పొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. సీఎస్ఈ హెచ్‌వోడీ ఆచార్య బి.ప్రజ్ఞ, సివిల్ హెచ్‌వోడీ డా.జి.శిరీష, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా.ఎస్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరిలో అధ్యాపకులకు సన్మానించారు. అదే విధంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డీ మార్ట్ వద్ద పాము కలకలం



గోపాలపట్నం డీమార్ట్ ప్రాంగణంలో పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ మణికంఠ

గోపాలపట్నం: గోపాలపట్నంలోని డీమార్ట్ వద్ద ఒక పాము భయాందోళనకు గురిచేసింది. శనివారం ఉదయం 11 గంటల సమయంలో డీమార్ట్ తెరిచారు. వినియోగదారులు లోపలికి వస్తున్న సమయంలో మార్ట్ ప్రాంగణంలోని కాలువలో పాము కనిపించింది. వెంటనే సిబ్బంది వెంకటాపురానికి చెందిన స్నేక్ క్యాచర్ సాయి మణికంఠకు సమాచారం అందించారు. స్పందించిన మణికంఠ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, చాకచక్యంగా పామును గుర్తించి పట్టుకున్నారు. ఇది విషపూరితమైందని, జెర్రి గొడ్డు అని మణికంఠ తెలిపారు. ఈ పామును సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెడతానని చెప్పారు. ఎక్కడైనా పాములు కనిపిస్తే వాటిని చంపవద్దని, సహాయం 63009 36547, 79956 21522 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

వేద విద్య ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: పల్నాడు జిల్లా మాదిపాడులోని వేద వేదాంత గురుకుల మహా విద్యాలయంలో వేద విద్య ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రొఫెసర్ శేషాద్రి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఇది ఓ సువర్ణావకాశమని చెప్పారు. వేద విద్యనభ్యసించదలచిన వారు 9963057025 నంబరుకు వాట్సాప్ సందేశం పంపాలని తెలిపారు. విద్యార్థులకు ధార్మిక విలువలతో కూడిన ఆధునిక విద్య అందించడంతో పాటు, ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందించేందుకు అవసరమైన మెలకువలు నేర్పనున్నట్టు చెప్పారు.తగిన ఆర్థిక సహకారం, ఉపకార వేతనాలు అందజేయనున్నట్టు చెప్పారు.

ఉమామహేశ్వరరావుకు అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడు, జాతీయ సేవా పథకం అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. కలకత్తాలోని వెల్ రెడ్ ఫౌండేషన్ సంస్థ వివిధ విభాగాల్లో ప్రకటించిన అవార్డుల్లో.. ఉమామహేశ్వరరావుకు సోషల్ సర్వీస్ విభాగంలో అవార్డు దక్కింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు శనివారం కళాశాలలో ఉమామహేశ్వరరావును అభినందించారు.